క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలు అందించండి

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, రాజేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని ముఖ్యకూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన బుగ్గారెడ్డి ఆస్పత్రిని బుధవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాని మనోహర్‌రెడ్డి, వైద్యులు అక్షయరెడ్డి, అనురాగ్‌రెడ్డి, కమ్మదనంసుధాకర్, పాతూరివెంకట్‌రావు, వంకాయలనారాణరెడ్డి, ఆకులశ్రీశైలం, యాదవాచారి, సూర్యప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత స్వాముల పాదయాత్ర



సంఘీభావం తెలిపిన నాయకులు

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల నియోజకవర్గంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రాజుముదిరాజ్ దుర్గామాత మాల ధరించిన స్వాములు కాళీమాత దేవాలయం వరకు పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం నిర్వహించిన పాదయాత్రలో భాగంగా హిమాయత్‌నగర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయం వద్ద కాలినడకన వచ్చిన భక్తులకు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేశ్, కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ్మా, కుమ్మరి దర్శన్, మాల స్వామి తదితరులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిభావం కలిగి ఉన్నప్పుడే మానవుడు సంతోషంగా జీవించగలరని తెలిపారు.

ప్రతీఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలి

- సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి



దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దాతలు, వెంకట్‌రెడ్డి

నందిగామ: సమాజంలో ప్రతీఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ వెంకట్ రెడ్డి అన్నారు. నందిగామలో నూతనంగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయ భూమి పూజలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన లంకాల శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డిల ఆర్థిక సహాయంతో దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. దసరా అనంతరం గ్రామంలో అమ్మవార్ల పండగ నిర్వహించనున్న నేపథ్యంలో నూతన దేవాలయాలను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, పెంటయ్య, కృష్ణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రాములు పాల్గొన్నారు.

కనువిందు.. సూర్యాస్తమయం!



హైతాబాద్‌లో కనువిందు చేస్తున్న సూర్యాస్తమయం

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో బుధవారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న సందర్భంలో చింత చెట్టుపై నుంచి బంగారు వర్ణంలో కనివిందు చేశాడు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం..!

- నీటి కుంటల నిర్మాణాలపై అవగాహన కరువు
- సద్వినియోగం చేసుకుంటే చక్కని ఫలితాలు
- పట్టించుకోని అధికారులు



వ్యవసాయ పొలాల్లో నిర్మించిన నీటి కుంట

కొత్తూరు: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసినప్పటికి కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అంతగా పెరగలేదు. రానున్న కాలంలో నీటి సమస్య రావచ్చు. నీటి ఎద్దడి సమయాల్లో వ్యవసాయ రంగం ఒడిదుడుకులకు గురవుతుంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం తగిన ప్రణాళికి చేపట్టింది. ఎక్కడి నీటిని అక్కడే భూమిలోకి ఇంకేందుకు తగిన చర్యలు చేసింది. ఇందులో భాగంగా నీటికుంటల (సేద్యపు కుంటలు) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ఆశయం బాగున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఫలితాలు మాత్రం శూన్యం. వర్షాకాలంలో వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు వ్యవసాయ పొలాలను దాటి రోడ్లపై, కాల్వల్లో వృథాగా పారుతోంది. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు
ఈ పథకం గురించి ముమ్మర ప్రచారం చేస్తే ఎంతో కొంత లాభిస్తుంది. నీటి కుంటల లక్ష్యం గురించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే చక్కని ఫలితాలు సాధించొచ్చు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని భావించిన ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించింది. సాగునీటి ప్రధాన కాల్వలు, ఉప కాల్వల్లో పూడిక తీయడం, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలతో పాటు పొలాల్లో నీటి కుంటల నిర్మాణాలు అనుసంధాన ప్రక్రియలో ప్రధానమైనవి. వీటి వల్ల కూలీలకు ఉపాధి లభించడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి పంటల దిగుబడి మరింత పెరగడానికి దోహదపడుతుంది. కాగా కొత్తూరు మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు 32 నీటి కుంటలను గత రెండేళ్ల క్రితం మంజూరు చేశారు. మల్లాపూర్‌లో 2, కొడిచర్లలో 4, శేరిగూడకు 6, సిద్ధాపూర్ గ్రామానికి 20 నీటి కుంటలు మంజూరయ్యాయి. రెండేళ్లు గడుస్తున్నప్పటికీ పలుచోట్ల పనులే ప్రారంభం కాలేదు. సిద్ధాపూర్‌లో 2, కొడిచర్లలో 2 కుంటల నిర్మాణాలను చాలా తక్కువ కొలతలతో రైతులు పూర్తి చేశారు. ఎస్‌బీపల్లిలో మాత్రం 6 కుంటలు నిర్మాణ దశల్లో ఉన్నాయి.

అవగాహన కల్పించాలి..

నీటి కుంటల నిర్మాణాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన యంత్రాగం ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. అందువల్ల రైతులు కూడా తెలిసి తెలియని పరిజ్ఞానంతో కుంటల నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతులు నిర్మించుకునే నీటి కుంటలకు ప్రభుత్వం కుంటల కొలతలను బట్టి చిన్నకారు, పెద్ద రైతులకు రూ.15,200 నుంచి రూ.2,90,000ల వరకు ఖర్చు చేస్తుంది. దీంతో ఐదెకరాలు ఉన్న చిన్న రైతులు, అంతకంటే ఎక్కువ పొలం ఉన్న రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవచ్చు.

స్థలం అనువుగా ఉంటే చాలు..

ఏ పొలంలోనైనా వర్షపు నీరు ఏదో మూలకు చేరుతుంది. నీరు నిల్వ చేయడానికి అవకాశం ఉన్న రైతుల పొలాల్లోని పల్లపు ప్రాంతాన్ని పని ప్రదేశంగా గుర్తించి నిర్మాణం చేపడుతారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతీరైతు నీటి కుంటలను నిర్మించుకునేందుకు అర్హులు. పొలంలో అనువుగా ఉన్న స్థలాన్ని బట్టి కుంటలను నిర్మిస్తారు. కుంటల నిర్మాణం పూర్తయితే పొలంలో నుంచి పారే వరద నీరంతా కుంటలోకి చేరుకునే వీలుంటుంది. పశువులు, పక్షులకు ఆ నీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా పొలంలోని వ్యవసాయ బోర్లలో నీటిమట్టం మరింతగా పెరుగుతుంది.

నీటికుంటలతో వ్యవసాయం పెరుగుతుంది..



నీటి కుంటల ఏర్పాటుతో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ విషయంలో రైతులకు మరింత అవగాహన కల్పించాలి. కుంటల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, వారు నిర్మాణాలు చేపట్టుకునే విధంగా ప్రోత్సహించాలి.

-రవీందర్‌రెడ్డి, రైతు, సిద్ధాపూర్

భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి..



వరద నీరు నీటి కుంటల్లో చేరడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. తద్వార వ్యవసాయ బోర్లలో నీరు పుష్కలంగా వచ్చి పంటల దిగుబడి పెరుగుతుంది. రైతులు నీటి కుంటలను నిర్మించుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. నీటి కుంటల నిర్మాణం కోసం ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో భాగంగా నిధులు సైతం అందిస్తుంది.

– శరత్‌చంద్ర, ఎంపీడీవో, కొత్తూరు

బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందాం

- జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి




మాట్లాడుతున్న కొత్త మాణిక్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ని గెలిపించుకుందామని జిల్లా నాయకులు కొత్త మాణిక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్‌లు అన్నారు. బుధవారం అజీజ్‌నగర్, ముర్తుజాగూడ, ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు అభివృద్ధి, సంక్షేమపథకాలే గెలిపిస్తాయని వారు జోస్యం చెప్పారు. చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య మూడోసారి గెలిచేవిధంగా ప్రజలను ఓటువేయమని అభ్యర్థించాలన్నారు. పదేళ్లల్లో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జీవంతు, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాహుఫ్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ శ్రీహరి, జిల్లా మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటాపూర్ బాలరాజ్, వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, సుధాకర్‌యాదవ్, డేవిడ్, మిట్టు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

- నవీన్ రెడ్డి మద్దతు ఎవరికో
- క్యూ కడుతున్న ప్రధాన పార్టీల నాయకులు



నందిగామ: అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 40 రోజులు మిగిలి ఉన్న నేపథ్యంలో మండలంలో రాజకీయాలు రోజు రోజుకు వేడెక్కుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా నందిగామ మండలం వీర్లపల్లికి చెందిన వీర్లపల్లి శంకర్ రంగంలో ఉండగా, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఉన్నారు. గత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన అంజయ్య యాదవ్ ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ కొట్టాలనే ప్రయత్నంలో ఆయన ఉన్నారు. వరుసగా రెండు సార్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచినందున మూడో సారి కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారనే ధీమాలో ఆ పార్టీ శ్రేణులు ఉన్నారు.

ఆ నేత మద్దతుపై సర్వత్రా ఉత్కంఠ..

మండల పరిధిలోని మొదళ్లగూడకు చెందిన కొత్తూరు మాజీ జెడ్పీటీసీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్ రెడ్డి మద్దతు ఈ ఎన్నికలలో కీలకంగా మారింది. కొత్తూరు, నందిగామ మండలాలతో పాటు నియోజకవర్గంలో తన కంటూ ఓ ప్రత్యేక పట్టు ఉన్న ఆ నేత మద్దతు కూడ కట్టుకునేందుకు ఇటు బీఆర్‌ఎస్, అటు కాంగ్రెస్ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీలకు చెందిన పలువురు ముఖ్యనాయకులు నవీన్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నువ్వా.. నేనా.. అనే రీతిలో పోటా పోటీగా తలపడనున్న ఈ ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకం కానుంది. ఈ నేపథ్యంలో నవీన్ రెడ్డి చూపు ఎటు వైపు ఉంటుందోననే చర్చజోరుగా సాగుతుంది. ఇటీవల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముఖ్యనేతలు నవీన్‌తో సంప్రదింపులు జరిపారనే చర్చజోరుగా వినవస్తుంది. కాగా నవీన్ రెడ్డి మాత్రం ఆచి తూచీ అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించగా బీజేపీ మాత్రం తమ పార్టీ అభ్యర్థిని ఇప్పటి వరకు ప్రకటించలేదు. దీంతో బీజేపీ ప్రకటించే అభ్యర్థిని బట్టి ముగ్గురు అభ్యర్థులతో ఎవరికి మద్దతు ఇస్తే బాగుంటుందో అనే ఆలోచనలో నవీన్ ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోకి ..

ఇటీవల నియోజకవర్గంలో అధిక శాతం ఆ సామాజిక వర్గం నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విధితమే. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, కేశంపేట జెడ్పీటీసీ విశాల రెడ్డి, ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీ వెంకట్‌రాం రెడ్డి, కొత్తూరు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డిలతో పాటు మరికొంత మంది నేతలు, ప్రజాప్రతినిధులు రేవంత్ రెడ్డితో చర్చలు జరిపి కొంత మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా మరికొంత మంది పార్టీ కండువా కప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన నవీన్ రెడ్డి మద్దతు కాంగ్రెస్ కా? బీఆర్‌ఎస్‌కా? లేదా బీజేపీకా? అనే చర్చనడుస్తోంది. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో ఉమ్మడి మండలాలతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా నవీన్ చూపు ఎటు వైపు ఉంటుందో అనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇక ఆయన చూపు ఎటు వైపు ఉందో వేచి చూడాల్సిందే.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



మొయినాబాద్‌లో బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో కాలె శ్రీకాంత్

- జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్

మొయినాబాద్: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని మొయినాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్ అన్నారు. మొయినాబాద్‌లో బుధవారం బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలె యాదయ్య మూడోసారి గెలుపు ఖాయమన్నారు. దీనికోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే యాదయ్యను గెలిపించేందుకు ఓటు వేయమని అభ్యర్థించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, మైనార్టీ నేత షేక్ మహబూబ్, మండల ఉపాధ్యక్షుడు జయవంత్, సుధాకర్‌యాదవ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీహరి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, పరమేష్, శుకూర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ధూంధాం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో గురువారం తెలంగాణ ధూంధాం కార్యక్రమం ఉంటుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 7 గంటలకు గ్రామంలోని ప్రధాన చౌరాస్తాలో జరిగే ధూంధాం కార్యక్రమానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ పాల్గొంటారని తెలిపారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆంజనేయులుగౌడ్



పార్టీ కండువా కప్పుతున్న షాబాద్ దర్శన్

మొయినాబాద్: బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బుధవారం మొయినాబాద్‌లో పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు మరో 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షాబాద్ దర్శన్ మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో యువత కాంగ్రెస్ వైపు ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. వెంకటేశం, రాజు, మాధవరెడ్డి, రత్నయ్య, గోవర్ధన్‌గౌడ్ తదితరులు చేరారు. మండల అధ్యక్షుడు మాణయ్య, పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రకాష్‌గుప్తా పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి

- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తన అనుచరులు ఫరూఖ్‌నగర్, కేశంపేట జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మైనార్టీ నేత జమృద్‌ఖాన్‌లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తో కానీ, అధిష్టానంతో కానీ తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. స్థానికంగా పార్టీలో తమకు సరైన గుర్తింపు లేదని వారు తెలిపారు. ఈ సందర్భంగానే బీఆర్‌ఎస్‌ని వీడేందుకు తాము సిద్ధమైనట్లు చెప్పారు. వచ్చే ఎన్నికలకు తాము దూరంగా ఉండాలని భావించినట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ఇంటికి వచ్చి కాంగ్రెస్‌లోకి చేరాలని ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో న్యాయం కోసం తాము పోరాటం చేసేందుకు అందరం కలిసి సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. వారు త్వరలో బీఆర్‌ఎస్‌కి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపునకు కృషి చేస్తామని వారు అన్నారు. ఈ సమావేశంలో తాండ్ర శ్రావణ్‌కుమార్ రెడ్డి, సురేశ్‌గౌడ్, కావలి యాదయ్య, పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగి పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దామని పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లిప్రతాప్‌రెడ్డి కార్యాలయంలో జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్రవిశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడిశ్యాంసుందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జమృద్‌ఖాన్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులను వీర్లపల్లిశంకర్ కలిశారు. ప్రజాప్రతినిధులు పార్టీలో చేరనున్న సందర్భంగా వారికి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందన్నారు.

శాకంబరిదేవీగా అమ్మవారు



షాద్‌నగర్: శాకంబరి దేవిరూపంలో అమ్మవారు



షాబాద్: దుర్గామాత పూజలో సర్పంచ్ పెంటయ్య



చేవెళ్ల: స్వామివారి పల్లకీ సేవలో మహిళలు

చేవెళ్ల: శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, రాత్రి ఆలయంలో పల్లకీ సేవా నిర్వహించారు. పూజారులు శ్రీకాంత్, శ్రీపాదు, వాసుదేవాచార్యులు, వామనాచార్యులు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రచ్చబండ ఆలయంలో..

రచ్చబండ ఆలయం వద్ద పాఠశాల విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు, దుర్గామాత మాలధరించిన స్వాములు పూజ చేశారు. చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన దుర్గామాత భక్తులు మల్కాపూర్ నుంచి ఆరమైసమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేశారు. అక్కడ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: పట్టణ శివారులోని బైపాస్ యమ్మీ హోటల్ సమీపాన బంగారు మైసమ్మ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం అమ్మవారిని శాకంబరిదేవీగా అలకరించారు.

షాబాద్: దసరా శరనవరాత్రి ఉత్సవాలను ప్రజలు వైభవంగా జరుపుకుంటున్నారు. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో దుర్గామాతకు సర్పంచ్ సమ్మి పెంటయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, శేఖర్, లక్ష్మయ్య, మాదవచారి, శేఖర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త



సీఐ యాదయ్యగౌడ్

షాబాద్: పండుగకు ఊరు వెళ్తున్నారా? జర మీ ఇల్లు జాగ్రత్త అని సీఐ యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పండుగకి ఊరు వెళ్లే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి గ్రామాల్లో, కాలనీల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఊరు వెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళం అమర్చుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదా 100కు ఫోన్ చేయాలని, మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళం వేసుకోవాలని చెప్పారు. నమ్మకమైన వాచ్ మెన్‌లను మాత్రమే పనిలో పెట్టుకోవాలని సూచించారు. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలని, వాటిని గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశముంటుందని తెలిపారు. మెయిన్‌గేట్, మెయిన్ డోర్‌కు తాళం వేస్తే అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలన్నారు. ఇరుగు పొరుగు వాళ్లకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనించమని చెప్పడం మంచిదన్నారు. మీ ఇంటికి వచ్చి, పోయే దారులు, ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకుని, డీవీర్ కనపడకుండా రహస్య ప్రాంతంలో పెట్టుకోవాలన్నారు. అల్మరా, కబోర్డ్స్ తాళాలు రహస్య ప్రదేశంలో జాగ్రత్త చేసుకోవాలని ఆయన సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



చేవెళ్ల : సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు



మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులతో కోలాటం ఆడుతున్న రవియాదవ్

చేవెళ్ల: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

మొయినాబాద్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని ఎస్ఐ రామచంద్ర అన్నారు. చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీరొక్కపూలతో బతుకమ్మలు పేర్చారు. పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఆడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: బతుకమ్మ అంటేనే మహిళలకు పెట్టిన పేరని, బతుకమ్మను గౌరమ్మతో సమానంగా కొలుస్తారని తెలంగాణలో బతుకమ్మ అంటేనే మహిళలు అని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, చైతన్య యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డిలు పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ రవీందర్, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఏ.రాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాంబాబు, రంగారెడ్డి జిల్లా విశ్వకర్మ కోకన్వీనర్ గన్నోజి భాస్కరచారి, రమేశ్ పాల్గొన్నారు.